క్లుప్తంగా

నేడు 'కంటివెలుగు'

మరికల్: మండలంలోని మాధవరంలో శనివారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు డాక్టర్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలతో బాధ పడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై ప్రారంభించాలని కోరారు.

కొనసాగుతున్న ప్రచారం



నారాయణపేట టౌన్ : రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు శ్రీ కాసాని జ్ఞానేశ్వర్ పరిశీలనలో భాగంగా ఇంటింటికి తెలుగు దేశం పార్టీ కార్యక్రమం పేటలో కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా నియోజవర్గ కో–ఆర్డినేటర్ వినయ మిత్ర యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని 21వ వార్డులో నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు భాస్కర్ రెడ్డి, శివకుమార్, ఆవుటి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వీజేఆర్ చేయూత



ఆత్మకూర్: పట్టణానికి చెందిన భవాని పెళ్లి ఖర్చుల కోసం వీజేఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేలు అందించామని ఆసంస్థ అధినేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన భవాని తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మారింది. ఇటీవలే భవానికి కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన యువకుడితో వివాహం కుదిరింది. ఆర్థిక పరిస్థితులు లేక పెళ్లి ఖర్చులు కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు వర్కటం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన శుక్రవారం భవాని ఇంటికి వెళ్లి రూ.20 వేల నగదును పెళ్లి ఖర్చుల కోసం అందించారు. కార్యక్రమంలో రఘు, జావిద్, ఆఫ్రిత్, మదిలేటి, అనిల్, నాని, నవీన్, పవన్, తరుణ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ బలోపేతానికి పనిచేయాలి'

కోయిల్‌కొండ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేయాలని నారాయణపేట నియెజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జమాల్‌పూర్‌లో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్టీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అంతకు ముందు గ్రామంలోని ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు విద్యాసాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతతో నిర్మించండి

అమరచింత: పట్టణంలో రూ.3.5కోట్లతో నిర్మిస్తున్న సీసీ రహదారులను మున్సిపల్ ఈఈ విజయభాస్కర్ శుక్రవారం పరిశీలించారు. కొత్తగా నిర్మించిన సీసీ రహదారులపై అప్పుడే నెర్రెలు కనిపించడం ఏంటని, రహదారులు నిర్మించి నెల రోజులు గడవక ముందే ఇలా ఎందుకు జరిగిందని ఆయన సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. రహదారులు నిర్మించే సమయాల్లో కాలనీవాసులు పైప్‌లైన్ల పేరుతో కాలయాపన చేయడంతో రహదారి నిర్మాణంలో ఆటంకాలు కలిగాయని కాంట్రాక్టర్ వివరించారు. పట్టణంలోని ఐదు ప్రదేశాల్లో నెర్రెలు గుర్తించామని వాటిని పూర్తి స్థాయిలో సరిచేయాలని ఈఈ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా ఐదు, నాలుగు, ఎనిమిది, పదో వార్డుల్లో నిర్మించిన సీసీ రహదారులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. మున్సిపాలిటీ ద్వారా ముందస్తుగా ఆయా వార్డు ప్రజలకు అవగాహన కల్పించకపోవడం ద్వారా కుళాయి పైప్‌లని, మురుగుకాలువ పైపులని ప్రజలు రహదారి నిర్మాణాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఇకపై ఆయా వార్డుల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ముందే ఇలాంటి చిన్నచిన్న మరమ్మతు చేసుకోవాలని సూచించారు. నలభై ఏళ్ల వరకు చెక్కు చెదరని విధంగా సీసీ రహదారులను పట్టణాల్లో నిర్మిస్తున్నామని, అన్నింట్లో నాణ్యత పాటిస్తున్నామని తెలిపారు.

తాగునీరు కలుషితం

ఆత్మకూర్: పట్టణానికే కాకుండా ఉమ్మడి జిల్లాకే తాగునీటిని అందిస్తున్న రామన్‌పాడ్ ప్రాజెక్టు వద్ద కాల్వలో పందుల మృత కళేబరాలు ఉండటంతో నీరు కలుషితం అవుతుందని పట్టణ ప్రజలు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ ద్వారా తాగునీరు రామన్‌పాడ్ రిజర్వాయర్‌కు నిత్యం సరఫరా అవుతుంది. దీంతో ఎక్కడి నుంచో కొట్టుకొచ్చిన జంతువుల మృత కళేబరాలు రామన్‌పాడ్ జలాశయం కాల్వ గేట్ల వద్ద నిల్వ ఉండటంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ గెలుపు సంబరాలు

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయులు మార్పు కోసం ఓటు వేశారని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డి గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు. ఆదర్శ బీఈడీ కళాశాలలో జరిగిన సీఎస్, డీఓల సమావేశం అనంతరం టీచర్లకు మిఠాయిలు పంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఈఓ, డీటీఓ, జెడ్పీ కార్యాలయంలో సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ నర్సింహా, దూసాసీతారాములు, గుంపుబాలరాజు, కిషోర్, విశ్వనాథ్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, సురేష్, కుర్మయ్య, రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బోణీ కొట్టిందని అవినీతి కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడినట్లేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పీ.శ్రీనివాసులు అన్నారు. ఏవీఎన్‌రెడ్డి గెలుపు సంబరాల్లో పాల్గొన్న ఆయన లిక్కర్ స్కామ్, పేపర్ లీకేజీ, ప్రాజెక్టుల నిర్మాణాలు తదితర అవినీతి కార్యక్రమాల్లో బీఆర్ఎస్ కూరుపోయిందన్నారు. ప్రభాకరవర్ధన్, రఘువీర్‌యాదవ్, రాము, రఘుపాల్, వెంకట్రాములు, రఘు, మణిమోదీ పాల్గొన్నారు.



కోస్గిలో సంబరాలు చేస్తున్న నాయకులు

మక్తల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డి గెలుపొందడంపై పట్టణంలో తపస్, బీజేపీ ఆధ్వర్యంలో వివేకనందా చౌరస్తా లో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంపీటీసీలు బాల్‌రాంరెడ్డి, రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: ఏవీఎన్ రెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ, ఏబీవీపీ, తపస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా సంబురాలు నిర్వహించారు. తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ ఏవీఎన్ రెడ్డి గెలుపునకు కృషి చేసిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, నాయకులు తాండ్ర నరేష్, బద్రీనాథ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ఏవీఎన్ రెడ్డి గెలుపుపై తపస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలను పెంచాలి



విద్యార్థులతో రాయిస్తున్న ఏఎంఓ విద్యాసాగర్

మరికల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎంఓ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని గాజులయ్యతండా ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో చదివించడం, రాయించడం చేయించారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన రావడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఫ్.ఎల్.ఎన్ కింద విద్యార్థుల ప్రగతి నివేదికలను వెంటనే విద్యార్థి ఇన్ఫోలో నమోదు చేయించాలని, యూ డైస్ ప్లస్ వ్యాలిడేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, సీఆర్పీ శివకుమార్ పాల్గొన్నారు.

నర్వ: విద్యార్థుల్లో సామర్థ్యాలను పరిశీలించేందుకు తొలిమెట్టుపై పట్టు సాధించాలని ఏఎంఓ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం జంగంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను తరగతి గదిలో పాఠ్యాంశాలను చదివించారు. రాయడం పరిశీలించారు. విద్యార్థులు చదవడం బాగానే ప్రాక్టీస్ చేశారని రాయడంలో తప్పులు చాలా దొర్లుతున్నాయని బాగా ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు నమోదు తప్పనిసరి అని అన్నారు. హెచ్ఎం మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి'



మాట్లాడుతున్న శ్రీనివాస్

ధన్వాడ: రాష్ట్రంలో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని బీఎస్పీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధన్వాడ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగులకోసం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే మరో పక్క కుమార్తె కోసం ముఖ్యమంత్రి ఢిల్లీ చుట్టు తిరుగుతున్నారని విమర్శించారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ఇన్‌చార్జ్ వెంకటేష్, మండల అధ్యక్షుడు రవియాదవ్, మైనారిటీ కన్వీనర్ సయ్యద్ మహమూద్, కోశాధికారి జడలబాల్‌రాజు, తిర్మలేష్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ధన్వాడ: మండల కేంద్రంలోని లక్ష్మీవాడలోని కొచ్చ గుడి ఆలయంలో గణపతి, అమ్మవారు, నాగుల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, స్వామివారి బ్రహ్మసూత్రలింగ దర్శనం చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నిర్వాహకులు కెంచెభాస్కర్, కావలివెంకట్రాములుతో పాటు కాలనీవాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తిచేయాలి

దామరగిద్ద: మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, శరణ్యనాయక్, అంజప్ప, ఖాజా, సీపీఎం నాయకుడు గోపాల్‌లు వేరు వేరు ప్రకటనలో పేర్కొన్నారు. పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు విన్నవించినా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. వెంటనే పనులు ప్రారంభించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వేడుకగా బొడ్రాయి ప్రతిష్ఠ



వేడుకల్లో పాల్గొన్న బీసీకాలనీ వాసులు

కోస్గి: పట్టణంలోని తెలుగు వీధి, బీసీ కాలనీల్లో శ్రీ నాభి శిలా(బొడ్రాయి) విగ్రహప్రతిష్ఠ ఉత్సవాలు మూడు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ అనంతరం విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి విగ్రహ సందర్శన, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, వేదాశీర్వచనము అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీ నాభి శిలా దేవి అమ్మవారికి బోనాలు సమర్పించారు. తెలుగు వీధిలో వేడుకలను మఠం హంపయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా కాశీ జ్ఞాన పీఠం నుంచి గురుసిద్ద మణికంఠ శివాచార్య మహాస్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠ చేశారు. బీసీ కాలనీలో రుద్రాక్షల మఠం అమరలింగ స్వామి ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు.

20న ఇంటర్వ్యూలు

కోస్గి: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమవేశ మందిరంలో ఉదయం 11.30 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఘనంగా ప్రీస్కూల్ మేళా



మేళాలో పాల్గొన్న చిన్నారులు

ధన్వాడ: గోటూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం ప్రీస్కూల్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్యాలు, ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల వయసున్న చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, సూపర్‌వైజర్ చంద్రకళ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రసన్న, అంజమ్మ, రాధిక, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: లింగంపల్లి గ్రామంలో మారెమ్మ విగ్రహప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారెమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ లత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

మరికల్: మండల కేంద్రంలో రెండు రోజుల నుంచి తరచుగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దీంతో ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు చదువుకోలేక పోతున్నారని యువక మండలి మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాసంక్షేమంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: ప్రజా సంక్షేమంలో అటు మోదీ, ఇటు కేసీఆర్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్ కుమార్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు మద్దతుగా మండల పార్టీ ఆధ్వర్యంలో యాత్ర కొనసాగిస్తున్నారు. మండల పరిధిలోని బొల్వోన్‌పల్లి, పీసీ తండాలో శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఆరాచక పాలనపై వివరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400లకే గ్యాస్ సిలిండర్‌లు ఇస్తే నేడు రూ. 1200 వరకు ధర పెంచి పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రజలను మాయ మాటలతో మోసం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పీసీ తండా బీఆర్ఎస్ అధ్యక్షుడు గోపాల్ రాథోడ్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి



మాట్లాడుతున్న వెంకటేష్ యాదవ్

నారాయణపేట టౌన్ : ప్రశ్న పత్రాల లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీసీసేన సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఎల్లప్ప, రాములు, రవి, కుర్మయ్య, నర్సింహా, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామి ఉత్సవాలు



నారాయణపేట రూరల్ : మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులోని తిరుమలనాథస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ఏర్పాటు కార్యక్రమాల్లో భాగంగా పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించి అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు కుంభం శివకుమార్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీవోఏలకు పదోన్నతులు కల్పించాలి



సమ్మెలో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట టౌన్ : అర్హులైన వీవోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భీమేష్, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద జరుగుతున్న సమ్మెలో పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగటానికి తోడ్పడుతున్న వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మొగులప్ప, అంజి, నాగయ్య, పావని, భాగ్యమ్మ, మహేశ్వరి, అనసూయ, వరలక్ష్మి, నర్సింహా, హన్మంతు, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఇటీవలే జరిగిన సౌతిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో మున్సిపాలిటీ పరిధిలోని ఎదిర రెవెన్యూ వార్డుకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సీనియర్ కరాటే మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు తులసి (9వ తరగతి), అపర్ణ(9వ తరగతి), మేఘన(7వ తరగతి) పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో హెచ్ఎం హేమచంద్రుడు, పీఈటీ మేరిపుష్ప, కరాటే మాస్టర్ సత్యనారాయణ తదితరులు అభినందించారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో రాణించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆర్థిక సాయం

మరికల్: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మహేష్ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిగా బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఎలక్ట్రీషియన్ సంఘం, కే.కే.ఆర్ ఫౌండేషన్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేశారు. కే.కే.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కృష్ణ, ఎలక్ట్రీషియన్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, చంద్రరెడ్డి, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

మక్తల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సీతయ్య అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వివిధ రకాలుగా అమాయకులను నేరగాళ్లు మోసం చేస్తున్నారని అన్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.

నర్వ: ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని ప్రజలు అప్రమత్తంగా ఉండడం అవసరమని పోలీస్ కళాజాతా సభ్యులు సురేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నర్వ మండలం ఉందేకోడ్ గ్రామంలో సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ అంశాలపై వివరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కళాజాతా బృందం సభ్యులు రుక్యానాయక్, శేఖర్, లింగన్న, కల్యాణి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపైనే విద్యుత్ లైన్లు



అమరచింతలోని శ్రీకృష్ణనగర్‌లో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని కాళికాలయం సమీప కాలనీలో ఇళ్లపై నుంచే 11 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. శ్రీకృష్ణనగర్‌లో రోజురోజుకూ జనాభా పెరుగుతుండటంతో ఇంటి నిర్మాణాలు పెరిగిపోయాయి. దీంతో తమ స్థలంలో 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుండటంతో నిర్మాణ సమయంలో యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్ మార్చాలని పలుమార్లు మున్సిపల్ పాలక వర్గానికి విన్నవించినా ఇప్పటి వరకు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. చిన్నారులు ఇంటి మిద్దెలపై ఎక్కి అక్కడే ఉన్న విద్యుత్ తీగలను పట్టుకుంటారేమో అన్న భయంతో కంటికి కునుకు లేకుండా బతికే రోజులు వచ్చాయని, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



గురువలింగంపల్లిలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

మాగనూర్: మాగనూర్ మండలంలోని గురువలింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా మమత, డీఈఓగా లలిత, ఎంఈఓగా మహేశ్వరి, ప్రధానోపాధ్యాయులు సుమిత్ర, ఎమ్మెల్యేగా సంజన, సర్పంచ్‌గా సౌందర్య తో పాటుగా మరి కొంతమంది చిన్నారులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలరాం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అందుకోసం చిన్నప్పటి నుంచే లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. విద్యా కమిటీ చైర్మన్ కిష్టయ్యగౌడ్, రమేష్, గోవిందు, భీమేష్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు సిమ్‌కార్డుల పంపిణీ



సిమ్‌కార్డులు అందిస్తున్న ఎంపీడీఓ రాజు

నారాయణపేట రూరల్ : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు శుక్రవారం ఎంపీడీఓ రాజు చేతుల మీదుగా సిమ్‌కార్డులను ఉచితంగా అందించారు. సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని, రెగ్యులర్‌గా హాజరు తీసుకునే సమయంలో నెట్ సమస్యలు లేకుండా ఉండేందుకు కొత్తగా సీమ్ కార్డులు అందించామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శోభారాణి, ఏపీఓ జయమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరీక్షలకు 33 మంది గైర్హాజరు

కోస్గి: మండలం ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష శుక్రవారం నిర్వహించారు. పట్టణంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం నిర్వహించిన పరీక్షకు రెండు కేంద్రాల్లో కలిపి 33 మంది గైర్హాజరయ్యారని ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.